# సింగిల్ పేజీ కథలు

## కానుక

విశ్వం మనసు మనసులో లేదు. ఏం చెయ్యాలో పాలుపోవడం లేదతనికి.

విశ్వం పెద్దమ్మ కూతురు భారతి పెళ్ళి తిరుపతిలో జరిగింది. ఆఫీస్‌లో సెలవు దొరక్కపోవడంతో విశ్వం ఆ పెళ్లికి హాజరు కాలేకపోయాడు.

ఈరోజు సాయంత్రం రిసెప్షన్ ఉన్న ఊళ్లోనే!

స్వంత చెల్లెళ్ళు లేని విశ్వం భారతిని స్వంత చెల్లెలికంటే ఎక్కువగా అభిమానిస్తాడు. చిన్నప్పటినుంచీ భారతి అంటే ఎంతో ఇష్టం.

తనకంటే ఐదారేళ్ళు చిన్నదైన భారతిని చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించేడు కూడా విశ్వం.

ఆమె పెళ్లికి వెళ్లే అవకాశం లేనందుకు చాలా విచారించాడు. రిసెప్షన్‌కు వెళ్ళాలని చెప్తే అతని భార్య విమల తప్పకుండా వెళ్దామంది.

స్వంత చెల్లెలికంటే ఎక్కువగా అభిమానించే భారతికి వెయ్యి రూపాయలు పెళ్లి కానుకగా యివ్వాలని విశ్వం సంకల్పం.

''ఏమిద్దాం భారతికి?'' అనడిగితే-

''రెండు వందల రూపాయలిద్దాం లెండి'' అంది విమల.

హతాశుడయ్యాడు విశ్వం. అందరిలా తనూ భారతికి రెండువందలే ఇస్తే ఏం బాగుంటుందని అంటే-

''ఆమె మీ స్వంత చెల్లెలేమీ కాదు కదా, రెండు వందలు చాల్లెండి'' అనేసింది విమల.

విమల ఒకసారి ఏదైనా అనుకుందంటే ఇక 'ససేమిరా' దాన్ని మార్చుకోదు.

అందుకే-

భార్యకు తెలియకుండా ముందుగానే భారతి దగ్గరకు వెళ్లి ఆమె చేతిలో వెయ్యి రూపాయలు పెట్టి రావాలని బయలుదేరేడు విశ్వం.

పెళ్లి ఇల్లు హడావిడిగా వుంది.

కొత్త పెళ్లికూతురు భారతి పట్టుచీరలో కళకళలాడిపోతోంది.

''రా అన్నయ్యా!'' అని ఆహ్వానించి చెయ్యి పట్టుకుని తన గదిలోకి తీసుకువెళ్ళింది విశ్వాన్ని.

ఆప్యాయంగా, ఆత్మీయంగా భారతిని కళ్ళారా చూసుకుని ఆనంద పరవశుడైపోసాగేడు విశ్వం.

ఈ బంగారుతల్లి ఇక పరాయిదైపోయిందన్న బాధ అతనిలో సుళ్ళు తిరిగి కళ్ళల్లో నీళ్ళూరేయి. తమాయించుకుని ఆమె తలపై ఆప్యాయంగా చెయ్యి వుంచి నిమిరేడు.

పెళ్లికి రాలేకపోయిన పరిస్థితి వివరిస్తే అర్థం చేసుకుంది భారతి.

పర్సులోంచి పది వంద రూపాయల నోట్లు తీసి ఆమెకు యివ్వబోతూ ''నీకు నచ్చిందేమైనా కొనుక్కోమ్మా'' అన్నాడు.

భారతి ఆ నోట్లు అందుకోలేదు.

''వదినకు తెలుసా అన్నయ్యా ఈ విషయం?'' అనడిగింది. వదినకు తెలిస్తే ఇంత డబ్బు అన్నయ్య నివ్వనియ్యదని ఆమెకూ తెలుసు.

''తెలీదమ్మా! అయినా ఆమెకు తెలియాల్సిన అవసరమేముంది?'' అన్నాడు విశ్వం.

''వద్దన్నయ్యా! వదినకు తెలియకుండా ఎందుకు ఇవ్వడం? రిసెప్షన్‌కి వచ్చినప్పుడు వదిన చేత్తో తీసుకుంటానులే'' అంది భారతి సున్నితంగా తిరస్కరిస్తూ.

''మీ వదిన నీకు ఇంత డబ్బు ఇవ్వనివ్వదమ్మా'' అన్నాడు విశ్వం.

''డబ్బుదేముందన్నయ్యా! నాకు కావలిసింది నీ ఆత్మీయత, అనురాగం. వదినకు ఎంత నచ్చితే అంతే ఇవ్వనివ్వు'' అంది భారతి.

తను వెయ్యి రూపాయలివ్వాలనుకున్నా, విమల తను అనుకున్న రెండు వందల రూపాయలకన్నా ఎక్కువ ఇవ్వనివ్వదని విశ్వానికి ఖచ్చితంగా తెలుసు.

ఇప్పుడతని సమస్య అదే! ఏం చెయ్యాలో పాలుపోక తలపట్టుకు కూర్చున్నాడతను.



పరిపరి విధాల ఆలోచించిన మీదట-

హఠాత్తుగా లేచి బీరువాలోంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి, వంద రూపాయల నోటంత సైజులోనే ఉన్న చిన్న కవర్లో పెట్టి, 'చెల్లెలికి ప్రేమతో విశ్వం అన్నయ్య' అని కవరు మీద రాసి, ''విమలా! ఈ కవరు గమ్‌తో అతికించి నా పర్సులో పెట్టు'' అన్నాడు కవరు విమల చేతికిచ్చి.

విమల కవరు తీసుకుని గమ్‌తో అంటించే ముందు కవరులోని రెండు వంద రూపాయల నోట్లను బయటికి లాగి చూసి తృప్తిపడి కవరు అంటించి భర్త పర్సులో పెట్టింది.

ఆ సాయంత్రం విశ్వం, విమల స్కూటర్ మీద భారతి పెళ్లి రిసెప్షన్‌కి వెళ్లారు.

వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు భార్యాభర్తలిద్దరూ.

పర్సులోంచి కవరు తీసి విమల చేతికిచ్చేడు విశ్వం.

వదిన ప్రేమగా ఇచ్చిన కవరు అందుకుని అన్నయ్యవైపు అపురూపంగా చూసి చిరునవ్వు నవ్వింది భారతి.

వధూవరుల్ని ఆశీర్వదించడానికి తమ వెనుక వేచి వున్న వారికి అవకాశం ఇస్తూ విశ్వం, విమల అక్కడనుంచి తప్పుకుని కుర్చీల్లో కూర్చున్నారు.

వాళ్ళ చేతుల్లోకి ఫలహారాల ప్లేట్లు వచ్చాయి.

తను గమ్ అతికించి పర్సులో ఉంచిన కవరు తీసేసి మరో అలాంటి కవరులోనే రెండు ఐదు వందల రూపాయల నోట్లు పెట్టి, ఆ కవరు మీద రాసినట్లే 'చెల్లెలికి ప్రేమతో విశ్వం అన్నయ్య' అని రాసి కవరు అతికించి, భర్త తన చేత ఆడపడుచు భారతికి ఇప్పించాడన్న నిజం విమలకు తెలియదు.

వంద రూపాయల నోట్లూ, ఐదువందల రూపాయల నోట్లూ ఇంచు మించు ఒకే సైజులో ప్రింట్‌చేసి తన సమస్యను పరిష్కారం చేసిన ప్రభుత్వం వారికి మనసులోనే కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు విశ్వం.

**-కోనే నాగవెంకట ఆంజనేయులు (విశాఖపట్టణం)**